మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- త్వరలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


చాకలిపేట కాట కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


కోటపేట కాలనీల్లో రూ. 3.70 కోట్లతో జరుగుతున్న కందకం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఆ దిశగా అంకితభావంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రతి కాలనీలలో మౌలిక వసుతుల కల్పనకు ప్రాధాన్యనిస్తున్నామని, ప్రతి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా చేసేందుకు చేపట్టిన పనులు తుదిదశకు చేరాయని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని మంత్రి గుర్తు చేశారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్స్ కోట్లమధు, ఇబ్రహీమ్, మధు తదితరులతో కలిసి ఆదివారం బేతంచెర్ల పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. దుర్గాపేట కాలనీల్లో సుమారు రూ.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలను మంత్రి పరిశీలించారు. దుర్గాపేట కాలనీలోని హోసన్న ప్రార్థన మందిరంలో పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోటపేట కాలనీల్లో రూ. 3.70 కోట్లతో జరుగుతున్న కందకం అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. అదేవిధంగా వడ్డెపేట, రేగిమానుపేట, కోటపేట , చాకలిపేట కాలనీలను పర్యటించారు. ఆయా కాలనీల యువకులు, ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి బుగ్గనకు ఘనంగా స్వాగతం పలికారు. వృద్ధులను, మహిళలను మంత్రి బుగ్గన ఆప్యాయంగా పలకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీస్తూ ముందుకు సాగారు. వడ్డెపేట కాలనీకి చెందిన శాంతి పాదుపు గ్రూప్ లీడర్ భారతి మంత్రితో మాట్లాడారు. మండల ప్రజలు ఊహించలేనంతగా అభివృద్ధి చేశారని ఆమె మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గోరుకల్లు రిజర్వాయర్ తాగు నీటి పైపు లైను నిర్మాణ పనులతో పాటు, బిల్ల సర్గం గృహలను సందర్శించామని ఆమె తెలుపగా... మీరంతా నాపై నమ్మకంతో ఓటు వేసినందన ఇంత అభివృద్ధి చేయగలిగాలని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. రానున్న రోజులో మరింత మెరుగైన అభివృద్ధి, శాంతియుత పాలనకు మరోమారు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. అనంతరం కోటపేట కాలనీల్లో రూ. 3.70 కోట్లతో జరుగుతున్న కందకం అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి నాణ్యతగా చేపట్టడమే కాకుండా వేగవంతం చేయాలని అధికారులు, కంట్రాక్టర్‌ను ఆదేశించారు.

రాద్ధాంతం తగదు...

చాకలిపేట, రేగు మాను పేట కాలనీల్లో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయడానికి సీసీ రోడ్డు వేయలేదని, పైపు లైన్లు వేయగానే సీసీ రోడ్డు వేస్తామని మంత్రి బుగ్గన తెలిపారు. అయితే సీసీ రోడ్డు వేయలేదని టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేయడం సమంజసం కాదన్నారు. డోన్ నియోజకవర్గం మొత్తం రహదారులు నిర్మాణానికి చర్యలు చేపట్టిన తాను ఈ కాలనీలకు రోడ్డు వేయకుండా ఉంటామా... టీడీపీ కుట్ర రాజకీయాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. బేతంచెర్లకు ఈనెలఖరుకు రూ. 350 కోట్లతో తాగునీటి సరఫరా అందించాలనే కృతనిశ్చయంతో యుద్ధప్రాతిపాదికన పనులు జరుగుతున్న విషయాన్ని స్థానికుల గమనించాలన్నారు. గోరుకల్లు నుంచి 70 కిలోమీటర్లు పైపులైను వేయాల్సిన పనులు తుది దశకు చేరిన నేపథ్యంలో రహదారి నిర్మాణాలు ఆపేసిన విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఆ పనులు పూర్తవ్వగానే రహదారి పనులు ప్రారంభిస్తామని, టీడీపీ అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని ఈ సందర్భంగా కాలనీ ప్రజలకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజా హుసేన్, మాజీ ఎంపీపీ కిట్టమ్మ, సర్పంచ్ రోజమ్మ, నాయకులు బాబుల్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, గూని నాగరాజు, బీరవోలు నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్,నడ్డి శ్రీను, జెల్లా శ్రీను, మురళీ, శేఖరయ్య, సలీమ్, పిట్టల జాకీర్ పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు....

టీడీపీ శ్రేణుల మోసపూరిత వాగ్దానాలు నమ్మొదని, కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇష్టారాజ్యంగా అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ మభ్యపెట్టేందకు కుట్రలు పన్నుతున్నారని మంత్రి బుగ్గన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సెంటున్నర స్థలం ఇస్తామంటూ టీడీపీ శ్రేణులు తిరుగుతున్నారని, ఎలా ఇవ్వగలరనే విషయాన్ని నిలదీయాలని ప్రజలకు సూచించారు. బేతంచెర్ల పట్టణంలో 12 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, సెంటున్నర స్థలానికి 300 ఎకరాలు అవసరమని, ఇందుకు రూ.150 కోట్లు కావాల్సి ఉంటుందని, టీడీపీ డోన్ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ఇస్తాడా .....లేక తెలుగు దేశం పార్టీ ఇస్తుందా అనే విషయాన్ని ప్రజలకు చెప్పాలని మంత్రి సూచించారు. సీఎం సహకారంతో డోన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఈ అభివృద్ధి టీడీపీ నాయకులకు మాత్రం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

నేడు రంగాపురంలో మంత్రి పర్యటన

- ఆర్బీకే భవనాన్ని ప్రారంభించనున్న బుగ్గన
- 150 మంది రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం పర్యటిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. ఉదయం 8:30 గంటలకు శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకుంటారని, 9:30 గంటలకు రంగాపురం గ్రామంలో ఆర్బీకేను ప్రారంభిస్తారు. అనంతరం ఆర్ఎస్ రంగాపురం రెవెన్యూ పరిధిలో మొదటి విడతగా 150 మంది రైతుల అసైన్డ్ భూములకు శాశ్వత హక్కు పత్రాలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పంపిణీ చేస్తారన్నారు. మంత్రి పర్యటనను గ్రామ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి జాతీయ వినియోగ దారుల హక్కుల వారోత్సవాలు

డోన్ టౌన్ : జాతీయ వినియోగదారుల వారోత్సవాలు 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డోన్ తాలూక వినియోగదారుల రక్షణ సంఘం అధక్షుడు ఏఈ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వారం రోజుల్లో వినియోగదారుల హక్కులు, రక్షణ, బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారుల రక్షణ అంశంపై కళాశాలు, హైస్కూల్ విద్యార్థులకు తెలుగు,ఇంగ్లిష్ భాషల్లో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : స్థానిక స్వగృహంలో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి 19 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20.76లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఇంత వరకు 20 విడతల్లో 902 మందికి రూ.5.46 కోట్ల చెక్కులను అందజేసామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు యువనేత కాటసాని ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దూదేకుల సంఘం వర్కింగ్ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక


నియామక పత్రం అందుకుంటున్న చిన్నబాబు

కోవెలకుంట్ల: దూదేకుల సంఘం వర్కింగ్ జిల్లా అధ్యక్షుడిగా సంజామల మండల ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ చిన్నబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు బాబన్ ఆదేశాల మేరకు ఆదివారం నంద్యాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకున్న చిన్నబాబు మాట్లాడుతూ దూదేకుల సామాజిక వర్గాల ఆర్థిక, రాజకీయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దస్తగిరి, ఉసేనప్ప, గోల్డ్ దస్తగిరి, సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ వెంకటరెడ్డి ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ


2024 నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రమాకాంత్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణ సమీపాన రవ్వల కొండపై వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నిత్యన్నదాన ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత గుండ్ల శింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆరేళ్లుగా వీరబ్రహ్మేంద్రస్వామి ముఖ చిత్రం కలిగిన క్యాలెండర్లను సొంత ఖర్చులతో ముద్రించి వీరబ్రహ్మేంద్ర స్వామి ట్రస్ట్‌కు అందజేస్తున్న చెన్నైకి చెందిన వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తుడు పార్తిబన్‌ను ఈ సందర్భంగా కాటసాని రమాకాంత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో నిత్యన్నదాన సంస్థ సభ్యులు రాజారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట్రామిరెడ్డి, నాగరాజు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మదాసి కురువ పట్టణ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

డోన్ రూరల్ : పట్టణంలోని స్థానిక మల్లేశ్వరాలయంలో ఆదివారం మదాసి కురువ, మదారి కురువ సంఘం పట్టణ నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ గౌరవ అధ్యక్షుడిగా మెకానిక్ చంద్ర, పట్టణ అధ్యక్షుడిగా జోగి హనుమంత్, ఉపాధ్యక్షుడిగా రాముడు, ప్రధాన కార్యదర్శిగా డొక్క చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా నాగార్జున, సంయుక్త కార్యదర్శిగా రామాంజినేయులు, కోశాధికారిగా వెంకటప్ప, అధికారిప్రతినిధి సొంటి పెద్దయ్య, కార్యవర్గ సభ్యుడిగా వెంకటరాముడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జి.రమేష్, రంగన్న, ఓంకారయ్య, రాజశేఖర్, కృష్ణమూర్తి, రామూర్తి, పకీరప్ప, ప్రతాప్, లక్ష్మన్న, మహేష్ పాల్గొన్నారు.

వలంటీర్ మృతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన వలంటీర్ ఈశ్వరయ్య (23) ఆదివారం మృతి చెందాడు. గుండె నొప్పితో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వలంటర్ మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రారంభమైన గాలిగోపురం పనులు


గోపురం పనులు చేస్తున్న శిల్ప కళాకారులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల సమీపాన ఎత్తైన కొండపై శ్రీకృష్ణ దేవరాయల పరిపాలన కాలంలో నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం కావడంతో కాలక్రమేణా శిథిలావస్థకు చేరింది. గ్రామపెద్దలు, భక్తులు ఆలయ పరిస్థితిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు రామ్‌కో సిమెంట్ యాజమాన్యంతో చర్చించారు. స్పందించిన యాజమాన్యం పురాతన ఆలయాన్నిరూ.7కోట్లతో అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం గాలిగోపురం పనులు అద్భుత శిల్పకళా సంపదతో నిర్మిస్తున్నారు. గతంలో మూడు అంతస్థుల గాలిగోపురం ఉండగా వాటి స్థానంలో ఐదు అంతస్తులతో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గర్భగుడి, ప్రహారీ నిర్మాణంతో పాటు ఆలయ ప్రాంగణంలో పనులు చేపట్టారు. చాలా ఏళ్ల తర్వాత లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పూర్వవైభవం సంతరించుకోనుంది.

ఆటో డ్రైవర్ మృతికి సంతాపం

బనగానపల్లె రూరల్ : నంద్యాల పట్టణంలో నూనేపల్లి వంతెన వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఆటో డ్రైవర్ బోయ భాస్కర్ మృతికి మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సంతాపం తెలిపారు. నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం భాస్కర్ మృతదేహాన్ని ఆటోలో బనగానపల్లె సమీపంలోని నంద్యాల సర్కిల్ వరకు తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు మృతదేహం ఉంచిన ఆటోపై భాస్కర్ చిత్రపటం ఉంచి ర్యాలీగా తీసుకెళ్లారు. జీఎం టాకీస్, పెట్రోల్ బంకు సెంటర్ మీదుగా ఈద్గా నగర్‌లోని మృతుడి ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. అనంతరం మృతదేహం పై పూలమాలలువేసి ఘన నివాళుర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆటో యూనియన్ తరుపున రూ.10 వేల ఆర్థికసాయం అందజేసినట్లు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు దస్తగిరి. బ్రహ్మయ్య, బొబ్బలు, నాగశేషుడు షేక్షావలి, హాజీ , ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


మృతుడు భాస్కర్ చిత్రపటంతో ర్యాలీగా వస్తున్న ఆటో యూనియన్ నాయకులు,డ్రైవర్లు

పెన్షనర్ల సమాజసేవ అభినందనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి తంగమని

డోన్ : సమాజ సేవలో భాగస్వాములవుతున్న డోన్ ప్రభుత్వ పెన్షనర్లు అభినందనీయులని సీనియర్ సివిల్ జడ్జి తంగమని పేర్కొన్నారు. పెన్షనర్ల డే సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి జడ్జితోపాటు కళారత్న శతావధాని దత్తాత్రేయశర్మ, ఎస్‌బీఐ, గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు సచింద్రబాబు, జయదేవి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సబ్‌ట్రెజరీ అధికారి రఘునందన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ శేష జీవితంలోనూ సమాజసేవ చేయాలనే తపన డోన్ ప్రభుత్వ పెన్షనర్లలో ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం రిటైర్డు తహసీల్దార్ రాధాక్రిష్ణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు హనీఫ్, మౌళాలి, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, సభ్యులు రాందాస్‌రెడ్డి, దాసప్ప, లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలిమిగుండ్లకు చెందిన రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పని నిమిత్తం బైక్‌లో రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తుండగా కల్వటాల సమీపంలోని ప్రధాన రహదారిపై మలుపు వద్ద బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ఆయనను 108లో తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు పీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల విద్యుత్ వేళలు వివరించారు. ఆల్వకొండ, వసంతాపురం, కమలపూరి, ముక్కమల్ల, రెడ్డిపల్లె, కానాల, గిద్దలూరు, నొస్సం, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నె పీడర్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరుకు, పేరుసోముల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల పీడర్లకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరుకు విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ వివరించారు.

మౌలిక వసతులు కల్పిస్తాం


సీసీ రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణంలోని ప్రతి కాలనీకి మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక మాలిక్‌బాబా సంస్థాన్ నుండి పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వరకు రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కౌన్సిలర్ కటికె వేణు, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, డీఈ రసూల్, ఏఈ సురేష్‌తో కలిసి చైర్మన్ పరిశీలించారు. డోన్ - నంద్యాల రైల్వే డబ్లింగ్ పనులు జరుగుతున్నందున ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతినిందన్నారు. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకురావడంతో వారు ఇక్కడ నూతనంగా సీసీ రోడ్డును నిర్మించడం జరిగిందని చైర్మన్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం





రామాపురంలోసీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి. సంగపట్నంలో భూ పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

- ప్రతిపల్లెలో ప్రభుత్వ కార్యాలయాలు
- నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

అవుకు: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి పల్లెలో ప్రభుత్వ కార్యాయాలు నెలకొల్పారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సంగపట్నం, రామాపురం గ్రామాల్లో రూ.2.39కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ఆదివారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, యువ నాయకుడు కాటసాని ఓబుల్ రెడ్డి, అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. సంగపట్నం గ్రామంలో రూ.38.4 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని, రూ.20.8లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను, రూ.26లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ పాఠశాల ప్రహారీని ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలోని 59 మంది లబ్ధిదారులకు 72.44 ఎకరాల భూమిణీ పంపిణీ చేశారు. అనంతరం రామాపురం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. రామాపురం-2లో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.23.94లక్షలతో నిర్మించిన ఆర్బీకేను, రూ.26లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ పాఠశాల ప్రహారీని, రూ.40లక్షలు గడపగడప నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రేన్ ద్వారా ఏర్పాటు చేసిన గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం రామాపురం గ్రామ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పల్లెల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు నెలకొల్పి పల్లెలకు పట్టణ శోభ తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణ రెడ్డి, నాయకులు చల్లా చరణ్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, రామాపురం సర్పంచ్ బందెల సువార్తమ్మ, ఎంపీటీసీ పేరం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, రామ సుబ్బారెడ్డి, గిరి, విశ్వనాథ్ రెడ్డి, వడ్డె పుల్లయ్య, మధనగోపాల్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి, రామారావు, రాము, ప్రమోద్, మాజీ సర్పంచ్ కొమ్ము చౌడమ్మ, అంజి, కంబయ్య, దస్తగిరి, అవుకు బలిజ సంఘం నాయకులు రామన్న, కంపిలి నారాయణ, క్రిష్ణమూర్తి, కాంట్రాక్టర్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జరిగే మేలును అడ్డుకోవడం.. టీడీపీ నాయకుల నైజం

మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ, సంగపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని తేదేపా నాయకుల ప్రజావ్యతిరేక తీరుపై మండిపడ్డారు. ప్రజలకు మేలు జరుగుతుంటే టీడీపీ నాయకులు ఓర్వలేరని, అడ్డుకోవడం వారి నైజంగా మారిందని కాటసాని ఎద్దేవా చేశారు. బనగానపల్లెలలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీని ... కొలిమిగుండ్లలో భూపంపిణీ చేయకుండా టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి అడ్డుకుంటే.... నాదీ అదేబాట అంటూ సంగపట్నం పెద్దాయనగా పేరొందని ఓ పెద్దాయన సైతం భూ పట్టాల పంపిణీ జరుగకుండా సర్వేనంబరు 334, 603లపై కోర్టులో వేసి పేదల అభివృద్ధికి అడ్డుకట్ట వేశారని కాటసాని విమర్శించారు. అదేవిధంగా రామాపురం గ్రామంలో సాయిబాబా పేరు చెప్పి ఏటా గురుపౌర్ణమి, పండుగల సందర్భంగా ఫ్యాక్టరీలు, గనుల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయటం, పేకాటలో డిక్కీలు ఎత్తి డబ్బులు తీసుకుంటూ ఈ పెద్దాయని దేవునికి సైతం చెడ్డ పేరు తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఈ పెద్దాయన తన బంధువు అని చెప్పుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీసీ... 2014 నుంచి 2019వరకు ఎమ్మెల్యేగా ఉండి కూడా సంగపట్నం గ్రామాన్ని ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.13.65 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో ప్రజల ఖాతాల్లో నగదు బదిలీ చేశామని, రూ.2.25 కోట్లతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశామని ఈ సందర్భంగా కాటసాని గుర్తు చేశారు.

23న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు


పాలుట్ల రంగనాథస్వామి

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె సమీపాన కొండల్లో వెలసిన పాలుట్ల రంగనాథస్వామి ఆలయంలో 23వ తేదీన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ మద్దిలేటి తెలిపారు. తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి, సమేత పాలుట్ల రంగనాథస్వామికి ప్రత్యేక పూజలతోపాటు 5:30 గంటలకు భక్తులకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. 12:05 నిమిషాలకు అభిజిత్ లఘ్నంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు తరలి వచ్చి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

బండలాగుడు పోటీలు

ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా న్యూటకేటగిరి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. విజేత వృషభాల యాజమాన్యాలకు వరసగా రూ.40 వేలు, 30 వేలు, 20 వేలు, 10వేలు, రూ.5 వేల నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించాలన్నారు. అలాగే గుండు ఎత్తుడు పందెం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


డోన్ : స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా భక్తిశ్రద్ధలతో గోవింద మాలధారులు స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజినీబాయి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ జరిగింది. వైఎస్ఆర్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో నిర్వాహకులు జాన్ ప్రభాకర్ రోగులకు రొట్టె, గుడ్డు, పప్పు అందజేశారు. స్థానికులు సుంకన్న తల్లి రూతమ్మ జ్ఞాపకార్థం రొట్టె, గుడ్డు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు.

21న వినికిడి యంత్రాల పంపిణీ

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీన ఒక్కొక్కరికి రూ. 4 వేల నుంచి రూ. 7 వేలు విలువ చేసే వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తామని కర్రా పౌండేషన్ చైర్మన్ కర్రా తేజవర్ధన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని కర్రా ప్రారంభించారు. కర్నూలుకు చెందిన కృష్ణ స్పీచ్, హియరింగ్ సెంటర్ వైద్యులు ప్రజలకు వినికిడి పరీక్షలు చేశారు. అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్రా మాట్లాడుతూ వైద్య శిబిరంలో వినికిడి లోపంతో బాధపడే వారిని గుర్తించామని, వీరందరికీ వినికిడి యంత్రాలు ఉచితంగా అందజేస్తామన్నారు. రాబోయే రోజుల్లో కర్రా పౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సభ్యులు సహ దేవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఆడియాలజిస్ట్ శివకృష్ణ పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కర్రా తేజవర్ధన్‌రెడ్డి

ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సూర్య బళ్లాని

బేతంచెర్ల: వాసవీ క్లబ్ ఇంటర్ నేషన్ 209ఏ ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన సూర్య బళ్లాని ఎన్నికైనట్లు జిల్లా గవర్నర్ జయంత్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈసందర్భంగా సూర్య బళ్లానికి జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గుండా నాగ సుప్రజ, వాసవీ, వనితా క్లబ్ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్యులు అభినందనలు తెలిపారు.

కృష్ణ ఎంపికపై హర్షం

డోన్ టౌన్ : నంద్యాల జిల్లా ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధక్షునిగా డోన్‌కు చెందిన కృష్ణ ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల పట్టణంలోని ఏపీ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికల్లో డోన్ ప్రభుత్వ పశువైద్యశాలలో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణను ఎన్నికున్నారు. డోన్ ఏరియా పశువైద్యశాల అధికారులు, సిబ్బంది కృష్ణకు అభినందనలు తెలిపారు.